# దగ్గరైన దూరం
# దూరమైన దగ్గర

స్వదేశ ప్రయాణం తలపెట్టినప్పుడే వీరభద్రుడికి ఒక సందేహం వచ్చింది. 'ఈ ఇద్దరు పిల్లలూ తాము పుట్టిపెరిగిన సీమలోని ఆ పల్లెల గాలికీ, ఆ నేలకూ, ఆ తిండికీ, ఆ దుమ్ముకూ, ఆ ఎండలకూ, ఆ మొరటు ప్రేమలకూ, ఆ భాషకూ, ఆ యాసకూ తట్టుకుంటారా? మూడు వారాలు అక్కడ ఉండగలుగుతారా? ముఖ్యంగా బుద్ధితెలిసిన లోహి ఇమడగలదా?' అని వీరభద్రుడి సందేహం. తనకు కలిగిన సంకోచం గురించి అర్ధాంగి సరస్వతికి చెప్పాడు.

సరస్వతి మనసులో కూడా ఆ అనుమానం తొంగిచూడకపోలేదు. అయితే, నిబ్బరంగా ఆమె చిన్న ఉపన్యాసం ఇచ్చింది:

"అక్కడ మనం పుట్టినాం. పెరిగినాం. మన దేశంలో మనవాళ్ళున్నారు. లోహి అక్కడ పుట్టింది. తొమ్మిదేండ్లు ఇక్కడ పెరిగింది. లీనా ఇక్కడే పుట్టింది. ఇద్దరికీ ఇండియా తెలియదు. మన ఊర్ల సంగతులు అసలే తెలీవు. ఇంత కాలంగా మనం మన వాళ్ళకు దూరంగానే ఉన్నాం. ఇంటికి డబ్బులు పంపటమొక్కటే ప్రేమ కాదు. కడుపులో దాచుకున్నది చెప్తా. నాకూ మా అమ్మానాన్నలను చూడాలని ఉంది. వాళ్ళకు పిల్లలను చూపాలని ఉంది. ముందు ముందు వీళ్ళకు పెళ్ళిళ్లు కావాలన్నా అక్కడి బంధాలు అవసరం. పైగా మనమేమీ వీళ్లను అమెరికన్ల మాదిరి పెంచలేదు."

"నిజమే. అక్కడి ప్రభావాలు, పరిస్థితులు పిల్లల మీద ఏమైనా..." వీరభద్రుడు నసిగాడు.

"ఉండవచ్చు. ఉంటాయి. ఎప్పటికైనా మనం అక్కడి వాళ్లమే" అంది సరస్వతి.

'అమెరికన్ సమాజం ఇచ్చిన సదుపాయాల్లో, సుఖాల్లో ఈ పిల్లలు పెరిగినారు - ఐదు గదుల ఇల్లూ, రెండు కార్లూ, కావలసిన బొమ్మలూ, బట్టలూ అన్నీ... కానీ అక్కడ...'

వీరభద్రుడి ఆలోచనలు పరిపరి విధాలుగా సాగాయి. ఏడేళ్లు తన చదువుల కష్టాలూ, అక్కడికి అక్కడ సాగిన బతుకూ, ఇప్పటికి సిద్ధించిన ఒక రకం స్థిరత్వమూ గుర్తుకొచ్చాయి. ప్రవాసి మనస్తత్వంలోని ద్వైదీభావంతో వీరభద్రుడు కొట్టుకుపోయాడు. ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తూ, సరస్వతి అన్న 'ఎప్పటికైనా మనం అక్కడివాళ్లమే' అన్నమాటా మనసును తొలిచాయి. వీరభద్రుడి శంక సగానికి పైగా తొలగిపోయింది.

కూతురు లోహిని అడిగాడు. లోహి తన అంగీకారాన్ని తెల్పుతూ అంది:

"ఇండియా చూడాలని ఉంది. గ్రేట్ కంట్రీ కదా నాన్నా! అక్కడ దేవాలయాలు, పెద్ద పెద్ద కోటలు. నేను చదివిన, మహాభారతం, రామాయణం, పంచతంత్రం, బుద్ధుడి జాతక కథలు, బీర్‌బల్ కథలు, అవన్నీ అక్కడివే గదా? నువ్వూ చెప్పినావు. ఇలియడ్, ఈసఫ్ ఫేబుల్స్ కంటే మన కథలే బావుంటాయి. తాతయ్యలనూ, నాన్నమ్మనూ, అమ్మమ్మనూ చూడాలని ఉంది. అక్కడ అందర్నీ చూడాలని ఉంది. పోదాం నాన్నా."

అప్పుడప్పుడే మాటలు వస్తున్న రెండేళ్లు నిండిన లీనాకు అక్క తెలుగు మాటలు అర్థం కాలేదు. కానీ 'ఇండియా, తాతయ్య, నానమ్మ, అమ్మమ్మ' అర్థమయ్యాయి.

"ఇండియా... ఇండియా... తాత, నానమ్మ, అమ్మమ్మ..." అని ముద్దు ముద్దుగా చప్పట్లతో తన సంతోషాన్ని ప్రకటించింది.

అపేక్షలూ, బంధుబంధాలూ కొత్త ఊపిరినీ, ఉత్సాహాన్నీ పిల్లల్లో తేవచ్చు అని వీరభద్రుడు సమాధానపడ్డాడు. అమెరికాలో తనుంటున్న ప్రదేశంలోని వారాంతాల వినోద సంస్కృతితో విసిగిపోయి ఉన్నారు.

పదేళ్ల అనంతరం నలుగురూ జన్మభూమిలో, రామాపురం గ్రామంలో అడుగుపెట్టారు. తల్లిదండ్రులూ, అన్నావదినెలూ అమితానందపడ్డారు. అమెరికా వీరభద్రుడొచ్చాడని బంధువులూ, బాల్య స్నేహితులూ పలకరింపులకు వచ్చారు. "అమెరికా పిల్లోళ్లు చానా బాగుండారు. వాళ్ల గౌన్లూ అవీ ఇంకా బాగుండాయి", అని వాళ్లను ఆ వీధిలో చూచిన పిల్లందరూ ముచ్చటించుకున్నారు. వాళ్లతో ఎప్పుడు ఆడుకుందామా అని కుతూహలపడ్డారు. ముఖ్యంగా లోహి, లీనా ఈడుల్లోని బాలికలు. తమతో కూడా ఆడుకుంటే బాగుంటుందని మగపిల్లలు అనుకున్నారు.

ముందటి రెండు దినాలలో లాగానే, రాత్రి ఇంటి ముందరి బయలులో మంచాలు వేసుకొని పడుకున్నారు. లోహి, ఆకాశం వైపుచూస్తోంది. లీనాకు చూపిస్తూ అంది.

"లీనా... లీనా అబ్బ! ఎన్ని స్టార్లో చూడు..."

లీనా ఆ పాటికే నిద్రలో ఉంది. లోహి మంచం దిగి, పక్క మంచంలో పడుకొని బాల్య స్మృతుల్ని నెమరు వేసుకుంటున్న తండ్రిని తట్టి అడిగింది:

"నాన్నా! డాలాస్ ఆకాశంలో ఇన్ని స్టార్స్ ఎందుకని కనబడవు?"

వీరభద్రుడిలో ప్రవాసాంధ్ర సంస్కారం మేల్కొంది.

"స్టార్స్ అనవద్దు లోహీ. చుక్కలు అనాల"

లోహి నవ్వింది. ఇంట్లో తెలుగు, బయట ఇంగ్లీషు.

"సరే చుక్కలు. ఇక్కడ ఎందుకిన్ని ఉన్నాయి?" అంది.

కూతురు ప్రశ్నకు వీరభద్రుడు ఆశ్చర్యపోయాడు. తమ ఇంటి వెనుక హరితవనంలో కూర్చొని ఎన్నో మార్లు డాలాస్ ఆకాశం వంక తానూ చూడకపోలేదు. కానీ చుక్కల్ని లెఖ్ఖ గట్టలేదు.

"డాలాస్‌లో ఇన్ని చుక్కలు లేవా లోహి తల్లీ?" అని అడిగాడు.

"ఊహు... ఒకటి, రెండు, మూడు... మబ్బులు చాలా చాలా కన్పడేవి."

లోహి అన్నది నిజమే. జ్ఞాపకం వస్తోంది. ఇటుక, ఊదా, పసుపు, నీలం రంగుల మబ్బులు ఈ రుతువులో కన్పించేవి. వర్షం ఉన్నట్టుండి దుమికేది. ఆకాశం నల్ల మోడమేసి, మధ్యమధ్య తెరపి ఇచ్చినా ఒకటే చినుకులు, వాన! ఒకరోజు సాయంత్రం నడకలో అప్పుడే తొంగి చూచిన రెండు నక్షత్రాల్ని చూసి లోహి వాటి పేర్లను అడగడం వీరభద్రుడి స్మృతిలో మెదిలింది. వాటి అసలు పేర్లు తనకు తెలియక "ఆ పడమటి వైపుండే దానిపేరు జార్జిబుష్, ఆ వైపు ఎదురుగా ఉండేది టోని బ్లెయిర్" అని అన్నాడు. లోహి పకపకా నవ్వింది.

తండ్రి పలక్కపోవడం చూసి లోహి తన మంచం చేరుకుంది. నిద్రలోకి జారుకుంది.

వారం, పది దినాలు పిల్లలు ఏ మారాములూ చేయలేదు. తాగేందుకు కాచి చల్లార్చిన వేణ్ణీళ్లు తప్ప, ప్రత్యేకంగా ఇవే కావాలని వాళ్లు అడగలేదు. సెరియల్స్, బేగల్స్, పాస్తా, డోనట్స్, వాఫెల్స్, నూడుల్స్, పిజా అంటూ అమెరికాలో అప్పుడప్పుడు లోహి అడిగేది. ఇక్కడ అడగలేదు. శుభ్రంగా పెట్టింది ఇద్దరు పిల్లలూ తిన్నారు – పొట్టేలు మాంసంతో సహా. కొత్త స్నేహితులు, కొత్త పరిసరాలు కొత్త కొత్త ఆటలు, కొత్త అనుభవాలు బుద్ధికి సరిపడితే పిల్లలు సులభంగా సర్దుకుపోతారు అని సరస్వతీ, వీరభద్రుడూ అనుకున్నారు. పిల్లలు మనలో ఎంత బాగా కలిసిపోయారు అని ఇంటిల్లిపాదీ సంతోషపడ్డారు.

అషాఢమాసం. ఎండలు డాలాస్ ఎండల్లాగానే ఉన్నాయి. కాకపోతే నల్లమోడాలు కన్పించలేదు. ముంగారి వానలు ఇంకా తొంగి చూడలేదు.

లోహీ, లీనా తమ ఈడు పిల్లలతో కలసి ఆడుకున్నారు. కట్టిన బట్టల్లో తేడా లేకుండా సరస్వతి చూసింది. ఊళ్లోని పిల్లలు వాళ్ళతో కలసి తిరగడంలో, ఆడుకోవడంలో ఎంతో ఉత్సాహాన్ని చూపారు. లోహి తెలుగులో మాట్లాడడం వాళ్లకు బాగుంది. మూడు మైళ్ల దూరంలోని కాన్వెంటుకు వెళ్లే పిల్లలు కూడా బిందెలతో నీళ్లు పట్టుకోవడం, చంకల్లోనో, భుజాల మీదుగానో మోసుకుపోవడం... అన్నీ లోహికి కొత్తగా కన్పించాయి. కొత్తగా కన్పించిన ప్రతిదాన్ని గురించీ, పల్లె స్నేహితురాళ్లను అడిగేది. వాళ్లు చెప్పినవి గుర్తుపెట్టుకునేది. తండ్రిని వాటి గురించి అడిగేది. అవసరమైన చోట్ల ఇంగ్లీషులో చెప్పించుకునేది. అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేది. తాను చదివిన కథల్లో 'ఇవి' 'ఇవి' లేవు అనుకుంది.

తాముంటున్న ప్లేనోలో వీటిని వేటినీ చూడలేదు. చదవనీ, చూడనీ లోకం కంటే అనుభవం పిల్లల్ని ఆకర్షిస్తుంది, ఆలోచింపచేస్తుంది. లోహి విషయంలో జరిగింది అదే, అనుకున్నాడు వీరభద్రుడు.

ఒకటి రెండుసార్లు డౌన్‌టవున్లో చూసిన నల్లజాతి వాళ్ల పిల్లల్లాగా పేదగా, మురికిగా ఇక్కడి పిల్లలు లోహీకి కన్పించారు. బాధపడింది. కల్లంలో కుక్కల్ని చూసి భయపడింది. అసహ్యించుకుంది. ఎనుములు పేడ వేసుకుంటూ ఇంట్లోంచి వీధిలోకి వెళ్లడాన్ని చూసి ఏవగించుకుంది. ఇంటి వెనుక దిబ్బనూ, దిబ్బలోంచి వచ్చే గంజూ, పేడకళ్ల వాసననూ చూడలేకపోయింది; భరించలేకపోయింది. పాలు పిండడం, మజ్జిగ చిలకడం సరదాగా కన్పించాయి. నొగలబండ్లను ఎద్దులు లాగడం చూసి ముచ్చటపడింది. కల్లంలో కంకుల గుండు వల్ల ఏం ప్రయోజనం ఉండేదో తెలుసుకొంది. దాని ఉపయోగం ఇప్పుడు లేదని గ్రహించింది. వాములు డాలాస్ పొలాల్లో కన్పించినట్లు - ఆ కంకుల గుండుల్లాంటి హే స్టాక్స్ - కన్పించినట్లు ఎందుకని లేవు? అని ప్రశ్నించుకుంది.

మినరల్ వెల్స్ వెళ్లే దారుల్లో చూచిన రాంచ్‌లలో, రెడింగులో ఉన్నప్పుడు చూచిన బార్నులలో లోహి కల్లాలను, కల్లాల వెనుక పొలాలను కూడా చూసింది.

ఒక సెలవురోజున ఇద్దరు స్నేహితురాళ్లు తమ స్కూలును చూపించారు. అక్కడి అనుభవం లోహిని దిగ్భ్రాంతికీ, జుగుప్సకూ గురి చేసింది.

ఒక స్నేహితురాలు అంది:

"ఉండు లోహీ! ఇప్పుడే వస్తా."

"ఎక్కడికి?"

ఆ అమ్మాయి కుడిచేతి బొటన వేలు పక్కవేల్ని వంచి చూపించింది.

"అంటే."

"నీ కొస్తే నా వెంట రా" అంది స్నేహితురాలు.

లోహికి అదేదో అర్థమయింది. అర్థం కాలేదు. స్నేహితురాలి వెంట నడిచింది.

స్కూలు ఆవరణలో ఒక మూల అటు ఇటు చూసి ఆ స్నేహితురాలు కూర్చొని, మునిగాళ్ల వరకూ పావడా కప్పుకుంది. కాసేపయ్యాక లేచింది.

"ఏం చేసినావు?" అని లోహి అడిగింది.

ఆ అమ్మాయి సిగ్గుపడింది. చెవిలో మెల్లగా చెప్పింది.

"ఉచ్చలు పోసినా"

"అంటే"

"ఒంటికి", అంది పక్కనున్న మరో స్నేహితురాలు నవ్వుతూ.

"అంటే? ఏమిటో చెప్పు?" అంది లోహి తికమకపడుతూ.

స్నేహితురాళ్లు అటూ ఇటూ చూశారు. దూరంగా నిలబడే మూత్ర విసర్జన చేస్తున్న ఒక పిల్లవాణ్ణి లోహికి చూపించారు. ఆ దృశ్యం చూసి లోహికి వెగటు కలిగింది.

'ఇక్కడ రెస్ట్‌రూమ్స్ ఉండవా?' అంది.

'అదేమమ్మా?' అని పిల్లలిద్దరూ అడిగారు.

'షిట్' అంది లోహి.

'ఏందో ఈ అమెరికా పిల్ల' అనుకొని నవ్వుకుంటూ 'ఇండ్లకు పోదాం పా' అన్నారు. అందులో ఒక అమ్మాయి అంది:

'నీకేమమ్మా చుట్టానివి. నేనింటికి పోయి బోరు నీళ్లు తేవాల. నాలుగు బిందెలు తేకపోతే మా అమ్మ తంతుంది.'

లోహి ఆశ్చర్యపోయింది, ఆ కష్టం విని.

ఈ మధ్యలో పిల్లల్ని తీసుకొని వీరభద్రుడు సరస్వతి వాళ్ల ఊరికి అద్దె జీపులో బయలుదేరాడు. అక్కడ మూడు రోజులున్నారు. చుట్టాలు వచ్చారు. ఆ మమకారాల కోలాహలంలో ఆడుకోడానికి లోహికీ, లీనాకూ వీలు దొరకలేదు. తమ ఈడు పిల్లలూ కనపడలేదు. ఆ పల్లెకు వస్తున్న దారిలో రోడ్డు పక్కల బీడు పొలాలు, ఒకటో రెండో చెట్లూ లోహి చూసింది. వాటిని గురించి తెలుసుకోవాలనుకుంది. కుదరలేదు. మళ్లీ తిరిగి రామాపురం చేరుకునేసరికి లోహికి ప్రాణం లేచి వచ్చింది.

ఒక అయిదురోజుల్లో అమెరికాకు తిరిగి వెళ్తారనగా, ఆ ఆదివారం పది పదిన్నర ప్రాంతంలో సరస్వతి, తోడికోడలూ రోలు దగ్గర పీట మంచాలు వేసుకొని కబుర్లలో ఉన్నారు. మిగతా అందరూ తోటలో ఉన్నారు. వీరభద్రుడు మాత్రం వసారాలో పత్రికా విలేకరుల్లాంటి ముగ్గురు నలుగురు బంధు స్నేహితులతో భేటీ అయి వున్నాడు.

వీరభద్రుడి కంటే వయస్సులో రెండింతలు పైగా ఉన్న మునెయ్య తాత వీరభద్రుణ్ణి అడిగాడు:

"వీరభద్రుడూ! నువ్వున్నావే అక్కడ - ఆ దేశంలో వానలెట్లా కురుస్తాయి? రైతులెట్లా ఉండారు?"

"తాతా! అక్కడివి అన్నీ నాకు తెలియవు. ఎవడి బతుకు వాడిదే. ఎవరి పని వాళ్లదే. తీరిక తక్కువ. తెలిసినమటుకు చెప్తా. పోయినసారి నేనుంటున్న టెక్సాస్ అనే రాష్ట్రంలో కరువు వచ్చింది. బయటపడినారు. నీళ్లను ఎట్లా కాపాడుకోవాలో వాళ్లకు తెలుసు. నలభై ఏండ్లుగా అక్కడ సరస్సుల్ని - మన చెరువుల మాదిరివి - కాపాడుకున్నారు. కాలువల్ని తవ్వుకున్నారు. కావలసినంత భూమి ఉంది. అమెరికా మొత్తం భూమిలో వాళ్లు సాగు కిందికి తెచ్చుకున్నది నూటికి అరవై ఇంతలే... సరేగాని తాతా. చెరువుల్లో పూడిక తీయించడం - అవేవో వాటర్‌షెడ్లూ, ఇంకుడు గుంతలు వీటి వల్ల మార్పు రాలేదా?" వీరభద్రుడు అడిగాడు.

"నువ్వు చూసినావుగదా? రైతును పట్టించుకునే రాజ్జెం కాదు ఇది", మునెయ్య తాత నిస్పృహలో అన్న మాటలకు ఏం చెప్పాలో తెలియక వీరభద్రుడు అయోమయంలో పడ్డాడు. "మరి... మరి.." అని చెప్పభోయాడు.

ఆ సమయంలో లోహి, లీనా వసారాలోకి వచ్చారు. చేతుల్లో తువ్వాళ్లతో స్విమ్మింగ్ డ్రెస్సులో వచ్చిన పిల్లలిద్దర్నీ చూసి వీరభద్రుడు అవాక్కయ్యాడు.

"ఏంది వీరభద్రుడూ? ఈ ఆడపిల్లోళ్ల ఆకారం - టీవీల్లో మాదిరి", ఒక దాయాది అడిగిన ప్రశ్నకు వీరభద్రుడు తడబడ్డాడు.

లోహి తండ్రి దగ్గరకు వచ్చి అంది:

"లీనా స్విమ్మింగ్ పోవాలంది. స్మిమ్మింగ్‌పూలుకు పోదాం."

"స్మిమ్మింగ్ పూలు అంటే ఏంది భద్రుడూ? అవి కొత్త రకం పూలా? మన పక్కల లేవే?" అని మునెయ్య తాత అడిగాడు.

"స్మిమ్మింగు కాదు తాతా? స్విమింగ్ అనాల," లోహి సరి చేసింది.

"అదేలే తల్లీ. అంటే ఏంది?"

లోహి తండ్రి వైపు చూసింది.

"అంటే చిన్నప్పుడు నాకు ఈత నేర్పినావు జ్ఞాపకం ఉందా, దిగుడుబావిలో?. స్విమింగ్ అంటే ఈత కోసం కట్టిన కోనేరు అనుకో," వీరభద్రుడు వివరణ ఇచ్చాడు.

మునెయ్య తాత నిట్టూరుస్తూ అన్నాడు:

"ఇంకెక్కడ దిగుడుబావులూ, కోనేర్లూ? ఆ కాలం పోయింది. బావులన్నీ గుంతలయినాయి. కోనేర్లు పూడిపోయినాయి. ఊరికంతా ఉండేది రెండు బోర్లు, పొలాల్లో మిగిలింది నాలుగు బోర్లు. నీళ్ళొచ్చేది రెండు దాన్లల్లో. అందులో మీదొకటి- నువ్వు పంపిన డబ్బుతో నన్నూరు అడుగులు కిందికిపోతే..."

మునెయ్య తాత మాటలు లోహికి పూర్తిగా అర్థంకాక అడిగింది:

"మనూళ్లో స్విమ్మింగ్ పూల్ లేదా?"

మాట మార్చి పిల్లలను ఏమార్చాలి వీరభద్రుడు అనుకున్నాడు.

"మనూళ్లో ఒకప్పుడు ఉండేవి లోహీ. ఈ తాతకు గజఈతగాడని పేరుండేది."

"గజఈతగాడంటే?" లోహి కుతూహలంగా తండ్రి పక్కన కూర్చొని అడిగింది.

లీనా కూడా అక్క పక్కన కూర్చుంది.

"ఏస్ స్విమ్మర్. ఏనుగు మాదిరి ఈదేవాడు అనుకో. గొప్ప ఈతగాడు"

"తాతా. నువ్వు ఏనుగు ఈతగాడివా?" లోహి పకపక నవ్వుతూ అడిగింది.

'ఇప్పుడా? మొండిగా బతుకును ఈదుతున్నా చిన్నతల్లీ', అన్నాడు మునెయ్య తాత.

ఆ మాటల్లోని బాధను వీరభద్రుడు గ్రహించాడు. ఉత్సాహ వాతావరణం కల్పించే ప్రయత్నంలో అన్నాడు: "మునెయ్య తాత ఒకమారు పెద్ద ఏరును ఈదినాడు, పెద్దవానలో ఏరు పొంగిపొర్లుతున్నప్పుడు."

"ఏరు మనూళ్లో ఉందా? ఏరు అంటే ఏది నాన్నా"

"రివర్. మన ఊరి దగ్గర లేదు. మన బంధువుల ఊళ్లో ఉంది, మన ఊరి దగ్గర వంక మాత్రం ఉంది"

"వంక అంటే"

"రివులెట్"

"నీళ్లుంటాయి గదా రివులెట్‌లో"

"వాన వస్తేనే మన వంకల్లో కొన్ని రోజులు నీళ్లు పారతాయి. ఇప్పుడుండవు"

వీరభద్రుడు ఓర్పుగా పిల్లలకు చెప్పడం చూసి మునెయ్యతాత మెచ్చుకున్నాడు. పిల్లల్ని గోము చేయడం బాగాలేదు అనుకున్నాడు దాయాది.

లీనాకు అసహనంగా ఉంది. 'అక్కా... అక్కా... నానా... నానా' అంటూ పిలిచింది. ఈత కోసం అన్నట్లు చేతులు కదిలిస్తూ అభినయించింది.

దాయాది ఓర్పు కోల్పోయి మనసులో మాట కక్కేశాడు:

"పిల్లల్ని ఇంత గోముగా పెంచకూడదురా వీరభద్రుడూ. పైగా ఆడపిల్లలు. ఈ బట్టలూ, ఈ ఈతలూ - నలుగురూ చూస్తే... వస్తా... పనుందిరా."

వీరభద్రుడు శాంతంగా సమాధానం చెప్పేలోగా ఆ దాయాది వెళ్ళిపోయాడు.

"వాడట్లానే అంటాడు. తిట్టి తిట్టి వీడి నోరు చెడింది. తిట్లు తిని ఒక కొడుకు తాగుబోతయినాడు. ఇంకొకడు ఎందుకూ పనికి రాకుండా తయారైనాడు", మునెయ్య తాత దాయాదిని గురించి ఫిర్యాదు చేశాడు.

వీరభద్రుడు పిల్లలకు అపేక్షలను పంచి ఇచ్చే విషయంలో తాను అమెరికాలో నేర్చుకున్నవీ, అనుసరించేవీ మనసులో మెదిలాయి. బంధు హింస తనకు తెలియంది కాదు అనుకున్నాడు.

తోట దగ్గర నుంచి అప్పుడే వస్తున్న వీరభాస్కర్ పిల్లల దుస్తులు చూసి నవ్వుతూ అడిగాడు:

"ఏమిట్రా లోహీ? నీకేం కావాలమ్మా లీనా?"

మునెయ్య తాత బోసి నవ్వు నవ్వుతూ అన్నాడు:

"వీరభాస్కరూ! ఈ పిల్లోళ్లు ఈతకు పోవాలంట."

"ఈతా? పోదాం లేర్రా. నేను తీసుకపోవాలే. కరెంటు ఇంకొక గంటే ఉంటుంది. పది నిముషాల్లో తోట దగ్గరకు అన్నం తీసుకపోదాం - అందరికీ," తడుముకోకుండా వీరభాస్కర్ పిల్లల్ని ఉత్సాహపరిచాడు.

"ఇంట్లోకి పోదాం. గుడ్డలు మార్చుకోండి. ఇప్పుడు వేసుకున్నవి తోట దగ్గర వేసుకుందురు," అంటూ పిల్లల్ని ఇంట్లోకి తీసుకవెళ్లాడు.

మునెయ్య తాత మెచ్చుకోలుగా అన్నాడు:

"చూసినావుగదా వీరభద్రుడూ? నీ దయవల్ల వాడిది ఇంజినీరు అయిపోతాది. ఇప్పటి ఓగు పిల్లకాయల మాదిరి కాదు వీడు. మిమ్మల్ని చూడటానికి తిరుపతి నుంచి వచ్చినాడా? ఇంటిపనీ, తోటపనీ అన్నీ చూసుకుంటాడు. గడ్డిమోపులు కూడా తెస్తాడు."

ఇంట్లోకి వచ్చిన పిల్లల్ని సరస్వతి చూసి విస్తుపోయింది.

"ఏమయిందర్రా మీకు? స్విమింగ్ డ్రెస్సులు నేను మన సూటుకేసుల్లో పెట్టలేదే" అంది.

"నా బ్యాగ్‌లో పెట్టుకున్నా. మా యిద్దరివీ," లోహి నిర్భయంగా జవాబిచ్చింది.

అన్నం గంపను భుజం మీద పెట్టుకొని, వీరభాస్కర్ నడవలోకి వచ్చి సరస్వతికి చెప్పాడు:

"చిన్నమ్మా! పిల్లల్ని మన తోట దగ్గరకు తీసుకపోతా. బయం లేదులే. అక్కడ అబ్బా, జేజి, నాయనా అంతా ఉన్నారు. ఈత... ఈత అంటున్నారు... లోహీ! లీనా! ముందు ఆ బట్టలు మార్చుకోండి" అన్నాడు.

పిల్లలు దుస్తులు మార్చుకున్నారు. ఈతదుస్తుల్ని లోహి పట్టుకుంది. వీరభాస్కర్ వెంట పిల్లలు నడుస్తూంటే సరస్వతికి ఏమనాలో తోచలేదు. వసారా వరకూ వాళ్లను వెంబడించింది.

వసారాలోని వీరభద్రుడు "నేను వీళ్ల వెంట వెళ్తున్నాలే... ఇంటికి వచ్చినాక చెబుతా గదా వీళ్ల తమాషాలు" అన్నాడు సరస్వతితో.

"లీనా అంతదూరం నడవగలదా?" అంది సరస్వతి, అమెరికాలో అప్పుడప్పుడు నడవనన్నట్లు మొండికేస్తే స్ట్రాలర్‌లో తీసుకవెళ్లడం గుర్తు చేసుకుంటూ.

"అంతగా అయితే ఎత్తుకుంటాలే," అన్నాడు వీరభద్రుడు.

తోటదారిలో చుట్టుపక్కల పొలాల్లో ఇంకా సేద్యమే లేదు. ఒకప్పటి చెట్లు లేవు. వీరభద్రుడు గమనించి బాధపడ్డాడు. ఇన్నాళ్లూ తోట దగ్గరకు వెళ్లలేకపోయాడు. ఇప్పుడు ఆ పరిసరాలు చూస్తుంటే, అమెరికాలోని రకరకాల చెట్లూ, గరికపచ్చ మైదానాలూ, పచ్చదనమూ... ఎన్నెన్నో మనసులో మెదిలాయి.

'ఇక్కడి భవిష్యత్తు ఏమవుతుంది?' అని మదనపడ్డాడు.

లోహి అటూ ఇటూ వింతైన పరిసరాలను గమనిస్తూ జాగ్రత్తగా, నెమ్మదిగా తండ్రి, అన్నల వెంట నడిచింది. లీనా కొంత దూరం నడిచాక చేతులు చాచింది, ఎత్తుకోమన్నట్లుగా. వీరభద్రుడు లీనాను ఎత్తుకున్నాడు.

తోట దరిదాపుల్లోకి రాగానే ఆ కాలిబాటలో చచ్చిపడిన ఒక కాకిని లోహి చూసింది. గాల్వెస్టర్ బీచిలో ఎవరిదో కారు కిందపడి, రెక్కలు చాచి బోర్ల పడుకున్న బొమ్మలాగా, చనిపోయిన సీగల్ లోహికి గుర్తుకు వచ్చింది.

"వీరా అన్నా! ఇక్కడ సముద్రం ఉందా?" అని అడిగింది.

"లేదురా. ఇక్కడికి మున్నూరు కిలోమీటర్ల దూరంలో ఉంది."

"అంటే ఎంతదూరం?"

వీరభాస్కర్‌కు ఏం చెప్పాలో తోచక చిన్నాన్నవైపు చూశాడు. అలవాటయిన అమెరికా కొలతల్లో "టు హండ్రెడ్ మైల్స్" అన్నాడు.

"ఓహో" అంది లోహిత, సముద్రం కూడా లేనందుకు విచారపడుతూ.

తోటలోకి వెళ్తూనే, తమ తోటలోని, పక్క తోటల్లోని ఇరవై ఎకరాల పచ్చదనాన్ని లోహి ఆశ్చర్యంతో చూసింది. పసుపుపచ్చటి పొద్దు తిరుగుడు పూలు, మిరప, టమోట, వంకాయ, ఉల్లిపూలు, గెట్లవార కంది – లోహి గమనించింది. పేర్లు అడిగి తెలుసుకుంది.

"వీరా. పొద్దుతిరుగుడు పూలు అంత చిన్నగా ఉన్నాయే. దిగుబడి పెద్దగా వచ్చేటట్లు లేదే" అని వీరభద్రుడు అడిగాడు.

'నీళ్లు చాలలేదు చిన్నాన్నా. మిరపకూ తెగులే. కందికీ తెగులే," అన్నాడు వీరభాస్కర్.

"తెగులు ఏమిటి వీరా అన్నా?" లోహి ప్రశ్నకు ఇంగ్లీషుమాట వీరాకు వెంటనే స్ఫురించలేదు.

"అమెరికాలో బగ్స్ చూసినావు గదా అవీ... పెస్ట్స్" అని కూతురికి వీరభద్రుడు ఇంగ్లీషు సమానార్థకాలు చెప్పాడు.

"అమ్మో! నేను రాను" అంది జంకుతూ.

మనుమరాళ్లనూ, కొడుకునూ, మనవణ్ణీ చూసి, మిరపకయ్యల్లో ఉన్న వీరభద్రుడి తండ్రి గబగబా వచ్చాడు. అప్పటికే లీనా కూడా చంక దిగింది.

"పిల్లల్ని ఇంత దూరం నడిపించినారా?" అన్నాడు.

"తాతయ్యా. నానమ్మ ఎక్కడా" అని లోహి అడిగింది.

"నానమ, నానమ" అంది లీనా.

"మా అమ్మవే...మా బంగారు కొండవే" అంటూ లీనాను ఎత్తుకొని, "అదుగో మీ జేజి – మీ నానమ్మ" అని ఉల్లిపువ్వుల కయ్యల్లోని భార్యను చూపించాడు.

"తాతయ్యా! ఈతకు వచ్చినాం" అంది.

వీరభద్రుడి తండ్రికి మతిపోయింది. కొడుకు వైపూ, మనమడివైపూ చూశాడు.

"అబ్బా! నేను చూసుకుంటలే. పిల్లల ముచ్చట తీర్చడం ఎట్లాగో నాకు తెలుసులే" అని వీరభాస్కర్ అన్నాడు.

"ఎట్లారా?"

"మన బోరు పైపు ఉందా? పైపులో నుంచి నీళ్లు వచ్చినప్పుడు ముందు కాలువలోని గుంతలో పడతాయి గదా?"

"నీకేమన్నా పిచ్చి పట్టిందా ఏరా? ఏదో మనమో, సేద్యగాళ్లో, కూలోళ్లో మంచినీళ్లు ఆ గుంతలో పట్టుకుంటాం. అక్కడ ఎప్పుడన్నా స్నానాలు చేస్తాం.. వీళ్లు ఈ పిల్లలు..."

"నువ్వు ఊరుకో అబ్బా! నేను చూసుకుంటాను"

వీరభాస్కర్ వ్యూహానికి వీరభద్రుడు ఆశ్చర్యపోయాడు. లోహి పట్టుదల తనకు తెలియంది కాదు. ఎండిపోయి సగం పూడిపోయిన పెద్దబావినీ, ఆ బావిలో మొలచిన చెట్లనూ, ఒకచెట్టుకు వేలాడుతున్న గిజిగాళ్ల గూళ్ళనూ, బావి అడుగున వేసిన బోరునూ, బావి పక్క చిన్న కొట్టంలో ఉండే మోటారునూ చూసి లోహి ఆశ్చర్యపోయింది. ఈత తొందరలో గిజిగాళ్ల గూళ్లను పట్టించుకోలేదు.

"ఎక్కడ ఈత?" అంది.

"ఇక్కడ" అని వీరభాస్కర్ నవ్వుతూ ఆ చోటు చూపించాడు.

మూడించి పైపు నుంచి, రెండించి నీళ్లు ఉరవడిగా వస్తున్నాయి. ఆ నీళ్లు మూడడుగుల వెడల్పు, నాలుగడుగుల పొడవు, రెండడుగుల లోతూ ఉండే రాతి బండలు పేర్చి కట్టిన గుంతలో పడుతున్నాయి. అక్కడి నుంచి గడ్డి దట్టంగా మొలిచిన కాలువలో పారుతూ, పోతున్నాయి.

స్ప్రింక్లర్ల పద్ధతి లేనందుకు వీరభద్రుడు విచారించాడు. 'ఎన్ని నీళ్లు వృధా అవుతున్నాయి?' అనుకున్నాడు. ఆ పద్ధతికి డబ్బు సాయం చెయ్యవచ్చు. కానీ... కానీ... అమెరికాలో ఈ ఆడపిల్లల పెంపకం, చదువు... ముందు ముందు పెళ్లిళ్లు అనుకొని భయపడ్డాడు. ఎవరి జీవితం వాళ్లది అనుకుంటున్న రోజుల్లో ఎవరి యుద్ధాలు వాళ్లు చేసుకోవాలి. బంధాలు, ప్రేమలు తప్పకపోవచ్చు. కానీ అన్నిటినీ కాపాడుకోలేం అనుకున్నాడు.

లోహి 'టబ్, టబ్' అంది నీళ్ల గుంత దగ్గరకు చేరి. అమెరికాలోని వాళ్ల ఇంట్లోని స్నానాల గదుల్లోని స్నానాలతొట్లు లోహికీ, లీనాకూ గుర్తుకొచ్చాయి. ఇద్దరూ నీటి ప్రవాహాకర్షణలో పడ్డారు. దుస్తులు మార్చుకున్నారు. గుంతలో దిగారు. నీళ్లను టపటప చేతులతో కొడుతూ ఈదినట్లు కదిలారు. జలభ్రమలో పడ్డారు. అది చూసిన వీరభద్రుడి తల్లీ, ఒకరిద్దరూ ఆడకూలీలూ విస్తుపోయారు. అరమరికలు లేని ఆ పిల్లలను చూసి ముచ్చటపడ్డారు. అరగంటకు పైగా పిల్లలిద్దరూ జలకాలాటల్లో మునిగారు. కరెంటు పోవడంతో వాళ్ల నీటి ఆట ముగిసింది.

ఆ రాత్రి దొంగమబ్బులు దోబూచులాడుతున్నాయి. వాన వస్తుందో ఏమోనని వీరభాస్కర్ చిన్నాన్న చిన్నమ్మలకూ, పిల్లలిద్దరికీ స్వయంగా మంచాలు వేశాడు. కరెంటు పోయింది. రెండు కిరసనాయిలు బుడ్లను వెలిగించారు. ఆ ఏర్పాటు లోహికి గమ్మత్తుగా ఉంది. విసుగ్గా ఉంది. వీరభద్రుడి నాన్న, అన్న భోజనాలు ముగించి తోట దగ్గరకు వెళ్లారు – ఏ అర్ధరాత్రో అపరాత్రో కరెంటు వచ్చినప్పుడు తోటకు నీళ్లు కట్టుకోవడానికి. వీరభద్రుడి తల్లీ, వదినా, సరస్వతి టి.వి.సీరియళ్ల గురించి మాట్లాడుకుంటూ కన్నీళ్లు కార్చుకుంటున్నారు. లీనా ఎప్పుడో నిద్రపోయింది. వీరభద్రుడూ, వీరభాస్కర్ ఏవేవో మాట్లాడుకుంటున్నారు.

ప్లేనోలోని తమ ఇల్లూ, పరిసరాలూ, తమ స్కూలూ, స్కూల్లోని చైనా పిల్లలూ, మెక్సికన్ పిల్లలూ, సాటి ఇండియన్లూ, అమెరికన్లూ, టీచర్లూ, స్కూలు ఆవరణలోని చెట్లూ చేమలూ, సరస్సూ, ఈతకు వెళ్లిన కమ్యూనిటీ స్విమింగ్‌పూల్, ఈత నేర్చుకోడానికి ఈత క్లాసులకు వెళ్లిన ఓక్ పాయింట్ రిక్రియేషన్ క్లబ్బులోని స్విమింగ్‌పూల్, ఆ పూల్‌లో పదహారు విభాగాల్లో ఈత నేర్చుకునే ఆడపిల్లలూ, మగపిల్లలూ అక్కడి సౌకర్యాలూ లోహి నెమరు వేసుకొంటోంది. ఇక్కడ బాగుంది. బాగులేదు. అనుకుంది. లోహి మెదడు రకరకాల జ్ఞాపకాలతో, సంకోచాలతో ప్రశ్నలతో తల్లడిల్లింది. ఇక్కడ లేనివి అక్కడున్నాయి. అక్కడ లేనివి ఏవో గ్రహించడానికి లోహి ప్రయత్నించింది.

వీరభాస్కర్ లోహిని అడిగాడు:

"లోహీ! నిద్ర వస్తోందా?"

"లేదు వీరా అన్నా"

"నీకు మన ఊరు నచ్చిందా?"

లోహి, తన ఆలోచనల్నీ, తెలుగు మాటల్నీ కూడగట్టుకుంటూ అంది. పూర్తిగా రాని తెలుగు – అక్షరాలు రాని తెలుగు – బాగా వచ్చిన ఇంగ్లీషు మధ్య నలిగిపోతూ అంది:

"ఇక్కడ బాగుంది, అమెరికాలో మాదిరి అన్నీ లేవు, ఎందుకు?"

ఎందుకు? అనే ప్రశ్న కూతురు నుంచి విని వీరభద్రుడు ఉలిక్కిపడ్డాడు. అమెరికా ఒక స్వర్గం, వెళ్లి తీరాలనే పట్టుదలతో ఉన్న వీరభాస్కర్‌కు ఏం సమాధానించాలో ఆ క్షణాల్లో దిక్కుతోచలేదు.

ఆ సీమ ఆకాశంలో దొంగమబ్బులు విచ్చిపోయాయి. తెల్లమోడమేసింది. గాలి స్తంభించింది. కరెంటు ఇంకా రాలేదు. ఆకాశంలో మాత్రం కోటానుకోట్ల నక్షత్రాలు మినుకు మినుకుమంటున్నాయి.

లోహి, నిద్రలో ఏవేవో చెల్లాచెదరిపోతున్న కలల్లో తేలాడుతూనే ఉంది.

● ఆదివారం ఆంధ్రజ్యోతి, 2 మార్చి 2003. ●